# రైతు సోదరీసోదరులకు ఒక లేఖ

***ప్రియమైన రైతు సోదరీసోదరులారా!***

**దే**శంలో చారిత్రక వ్యవసాయ సంస్కరణలకు సంబంధించి కొన్ని రోజులుగా నేను మీతో నిరంతరం సంప్రదింపులలో ఉన్నాను. కొన్ని రోజుల కిందట నేను వివిధ రాష్ట్రాల రైతు సంఘాలతో చర్చించాను. వాటిలో అధికశాతం ఈ వ్యవసాయ సంస్కరణలను స్వాగతించడంతోపాటు వీటిపై హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ చట్టాలవల్ల నేడు రైతులలో కొత్త ఆశలు చిగురించాయి. అంతేగాక దేశంలోని పలు ప్రాంతాల రైతులు ఇప్పటికే ఈ కొత్త వ్యవసాయ చట్టాలను సద్వినియోగం చేసుకోవడం ప్రారంభించారు. మరోవైపు ఈ సంస్కరణలపై కొన్ని రైతు సంఘాలు రైతులలో అపోహలు సృష్టించాయి. ఈ నేపథ్యంలో ప్రతి రైతు మదిలోని అయోమయాన్ని తొలగించి, వారి ఆందోళనను ఉపశమింపజేయడం దేశ వ్యవసాయ శాఖ మంత్రిగా నా కర్తవ్యం. ముఖ్యంగా ఢిల్లీ నగరం, పరిసర ప్రాంతాల్లో ఆందోళన పేరిట ప్రభుత్వానికి, రైతులకు మధ్య అబద్ధాల గోడలుకట్టే కుట్ర సాగుతోంది. కాబట్టి ఈ వాస్తవాన్ని మీ ముందుంచడం నా బాధ్యత.

**నే**ను రైతు కుటుంబం నుంచి వచ్చాను. వ్యవసాయం లోతుపాతులు, సవాళ్లు రెండింటినీ చూస్తూ పెరిగాను. పంటకు నీరు పెట్టడం కోసం అర్ధరాత్రి నిద్రలేచి పొలానికి వెళ్లడం, నీరు పారే సమయంలో గట్లు తెగిపోతే పరుగులు తీస్తూ వాటిని పూడ్చటం, అకాల వర్షాలతో భయం, సకాలంలో వర్షాలు పడితే కలిగే ఆనందం ఇవన్నీ నా జీవితంలో విడదీయరాని భాగం. ఇక ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చిన తర్వాత అమ్ముకోవడం కోసం వారాల తరబడి వేచిచూడాల్సి రావడం కూడా నాకు అనుభవమే. ఇటువంటి పరిస్థితులు, స్థితిగతుల మధ్య కూడా మన రైతన్న దేశం కోసం మరింత దిగుబడి సాధించడానికే ప్రయత్నిస్తాడు. భారత రైతాంగం పడుతున్న ఈ కష్టాలన్నిటినీ మేం గమనించాం. చివరకు కరోనా మహమ్మారి సంక్షోభ సమయంలోనూ వారు పొలాల్లో శ్రమించడం మానలేదు. ఇబ్బడిముబ్బడి దిగుబడుల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకోవడంలో వారు ఎంతగానో తోడ్పడ్డారు. అంతేగాక రికార్డు స్థాయిలో విత్తనాలు వేయడంద్వారా అత్యధిక భవిష్యత్ దిగుబడులకు భరోసానిచ్చారు.

**వ్య**వసాయ శాఖ మంత్రిగా నాకు సంతృప్తి కలిగించే విషయం ఏమిటంటే- కొత్త చట్టం అమలులోకి వచ్చాక కూడా కనీస మద్దతు ధరపై ప్రభుత్వపరంగా ఈసారి ఆహారధాన్యాల సేకరణ గత ఏడాది రికార్డులను బద్దలు కొట్టింది. ఈ విధంగా మా ప్రభుత్వం కనీస మద్దతు ధరపై ఆహార ధాన్యాల సేకరణలో రికార్డులు సృష్టిస్తూ, సేకరణ కేంద్రాల సంఖ్యను పెంచుతుండగా మరోవైపు

కనీస మద్దతు ధరకు ప్రభుత్వం స్వస్తి పలుకుతుందన్న అవాస్తవ ప్రచారంతో రైతులను కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు వ్యక్తులు చేస్తున్న ఈ నిరాధార అవాస్తవ ప్రచారాన్ని గుర్తించి దాన్ని పూర్తిస్థాయిలో తిప్పికొట్టాలని ఈ సందర్భంగా నేను రైతులను కోరుతున్నాను. సాగు వ్యయానికి ఒకటిన్నర రెట్లు అధికంగా కనీస మద్దతు ధరను ప్రభుత్వం రైతులకు ఇస్తోంది. ఆ మేరకు గడచిన ఆరేళ్లలో కనీస మద్దతు ధర కింద రైతుల ఖాతాలకు దాదాపు రెట్టింపు మొత్తాన్ని బదిలీ చేసింది. కాబట్టి ప్రభుత్వం కనీస మద్దతు ధర విధానానికి స్వస్తి చెప్పే ప్రసక్తే లేదు. కనీస మద్దతు ధర కొనసాగి తీరుతుంది... కొనసాగుతూనే ఉంటుంది.

ప్రియమైన రైతు సోదరీసోదరులారా!

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన జీవితానికి నిర్దేశించుకున్న అత్యంత ప్రధాన లక్ష్యాలలో రైతు సంక్షేమం ఒకటి. రైతు ఆదాయాన్ని పెంచడానికి, వారి జీవితాల్లో సౌభాగ్యం నింపడానికి ప్రధాని నేతృత్వంలోని ఈ ప్రభుత్వం నిరంతరం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఆ మేరకు గడచిన 6 సంవత్సరాల్లో రైతు సాధికారత కోసం మా ప్రభుత్వం 'విత్తనం నుంచి విక్రయం' దాకా ప్రతి దశకూ సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకొంటోంది. ఇవన్నీ రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేయడంతోపాటు వారికి ఎదురయ్యే ఇబ్బందులు తొలగించి, లాభాలు వచ్చేలా చేస్తాం. దేశంలోని కర్షకులలో 80 శాతానికి కేవలం ఒకటి లేదా రెండెకరాల భూమి మాత్రమే ఉందన్న వాస్తవం మీకు తెలియనిది కాదు. అటువంటి రైతులు స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ తమనుతాము పోషించుకోవడానికి వ్యవసాయం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ చర్యలవల్ల ఇలాంటి చిన్న రైతులు లబ్ధి పొందుతున్నారు.

కష్ట సమయాల్లో మీరు రుణాలు తీసుకోనక్కరలేకుండా ప్రభుత్వం మీకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా రూ.6 వేల వంతున ఆర్థిక సహాయం అందిస్తోంది. అలాగే పంటల బీమా రక్షణ వల్ల ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టపోతే మీకు పరిహారం లభిస్తుంది. ఇక భూసార కార్డుల సాయంతో రైతు తన పొలంలో భూసారంపై సరైన అవగాహన పొందుతుండగా మరోవైపు వేపపూత యూరియా వల్ల ఎరువులు నల్లబజారుకు తరలడం ఆగిపోయి రైతుకు ఎంతో ఉపశమనం లభించింది. అన్నదాత శక్తిప్రదాతగా కూడా మారాలన్న లక్ష్యంతో దేశం నేడు ముందడుగు వేస్తోంది. గోదాములు, శీతల గిడ్డంగులు, ఆహార తయారీ కేంద్రాల్లో అత్యధికం గ్రామీణ ప్రాంతాల్లో కాకుండా పెద్ద నగరాలలో ఉండటమన్నది రైతులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలలో ఒకటి. దీంతో వాటివల్ల రైతుకు సంపూర్ణ ప్రయోజనం దక్కదు. ఈ అసమతౌల్యాన్ని చక్కదిద్దడంలో భాగంగా ప్రభుత్వం నేడు రూ.లక్ష కోట్లతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేసింది. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఇలా పలు చర్యలు తీసుకుంటోంది. అదే సమయంలో మార్కెట్ లభ్యత లేక రైతు నిస్సహాయుడు కాగా, ఆరుగాలం

కష్టించి వారు పండించిన పంటను చౌకగా దోచుకుపోతున్న కొందరు వ్యాపారులను ప్రభుత్వం గమనించింది. చివరకు తమ పంట ధరను తాము నిర్ణయించుకుని ఎక్కడైనా విక్రయించుకునే స్వేచ్ఛ భారత రైతాంగానికి లేకుండా పోయింది.

**రై**తు ఎంతటి నిస్సహాయ స్థితిలో ఉన్నదీ అందరికీ తెలుసు... అందరూ ఇది అర్థం చేసుకున్నారు కూడా. మాకు ముందున్న ప్రభుత్వాలు కూడా రైతుకు బహిరంగ విపణి సదుపాయం కల్పించాలని చెబుతూండేవి. అయితే, అటల్ జీ ప్రభుత్వ హయాంలో దీనిపై 2001లో చర్చల ప్రక్రియ ప్రారంభమైంది. కానీ, ఆ తర్వాత కేంద్రంలో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యమేలింది. అంతేకాకుండా ఈ సంస్కరణలకు మద్దతు పలుకుతూ వాటి గురించి తమ ఎన్నికల ప్రణాళికలోనూ పొందుపరచింది. కాగా, రైతుకు సంకెళ్లు వేసిన పాత విధానంతో ఎవరూ ఏకీభవించలేదన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో గత 20-25 సంవత్సరాల్లో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం కోసం రైతుకు ఇతరత్రా మార్గాలు అవసరం లేదనీ, ఇప్పుడున్న వ్యవస్థ మంచిదని ఏ రైతు నాయకుడైనా, లేదా సంఘమైనా ప్రకటించిన ఉదాహరణలు ఉన్నాయా? అని నేను ఈ లేఖద్వారా ప్రశ్నిస్తున్నాను. ఈ బంధనాల నుంచి రైతుకు విముక్తి కోరుతూ భారీ రైతు సంఘాలు ప్రదర్శనలు చేస్తున్నాయి. అలాగే ఈ సంస్కరణలు లేకుండా భారతదేశంలో రైతు జీవితాల్లో మార్పు తేవడం కష్టసాధ్యమని వ్యవసాయ నిపుణులు కూడా స్పష్టం చేస్తున్నారు.

**దే**శంలో 2014నాటి ఎన్నికల తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినపుడు ఈ సంస్కరణలపై మేం తాజా చర్చలు చేపట్టాం. అటుపైన నమూనా చట్టాలను అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పరిశీలనకూ పంపాం. ముఖ్యమంత్రుల కమిటీల నడుమ చర్చలు సాగాయి. మొత్తంమీద ఆరు నెలల వ్యవధిలో ఈ విషయాన్ని మేం దేశంలోని కోట్లాది రైతులవద్దకు తీసుకెళ్లాం. అనంతరం కొత్త వ్యవసాయ చట్టంలోని నిబంధనలు, రైతులకు సంబంధించిన వివిధ అంశాలపై సుమారు 1.5 లక్షల శిక్షణ కార్యక్రమాలు-వెబినార్ సెషన్లు నిర్వహించి చర్చించాం. ఇంత సుదీర్ఘ ప్రక్రియ తర్వాతనే ఈ కొత్త వ్యవసాయ చట్టాలను రూపొందించాం.

***<u>రైతు సోదరీసోదరులారా!</u>***

**దే**శవ్యాప్తంగా మండీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలు మరింత బలోపేతం అవుతున్నాయి. దీంతోపాటు మీ ఉత్పత్తులను మీ ఇంటివద్దనే మంచి ధరలకు విక్రయించుకునే అవకాశాన్ని కూడా బహిరంగ మార్కెట్ కల్పిస్తుంది. దీనివల్ల పొలం నుంచి మండీలకు ఆహారధాన్యాల రవాణా వ్యయం కూడా ఆదా అవుతుంది. ఇక మార్కెట్‌కు ప్రత్యామ్నాయం ఉండనే ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల మండీలు ఎప్పటిలాగానే పనిచేస్తూంటాయి. గత 5-6 సంవత్సరాల్లో వ్యవసాయ మండీల ఆధునికీకరణ కోసం ప్రభుత్వం

కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఇక రాబోయే కాలంలో ఇవి మరింత ఆధునికంగా మారుతాయి.

వాస్తవాలు ఇలా ఉండగా కాళ్లకింది నేల కదిలిపోతున్న రాజకీయ నాయకులు నేడు రైతుల భూమిని ఎవరో లాక్కుంటారనే అబద్ధపు ప్రచారంతో వారిలో అనుమానాలను రేకెత్తిస్తున్నారు.

రైతుకు-వ్యాపారికి మధ్య ఒప్పందం పంట దిగుబడికి మాత్రమే పరిమితమైనప్పుడు భూమిని ఎవరైనా ఎలా లాక్కోగలరు? భూమికి యజమాని రైతేనని కొత్త చట్టం స్పష్టంగా పేర్కొంటోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య పథకం కింద ప్రతి గ్రామీణ కుటుంబానికీ యాజమాన్య హక్కు కల్పిస్తున్నందున రైతుల నుంచి అంగుళం భూమినైనా లాక్కోవడం అసాధ్యమే!

మా ప్రభుత్వం ఉద్దేశ్యం, విధానం రైతు సంక్షేమానికి నిబద్ధతతో ఉంది.

***సోదర, సోదరీ మణులారా,***

ఎమ్.ఎస్.పి, మండీ, భూఆక్రమణలకు సంబంధించి సృష్టించబడుతోన్న  గందరగోళాన్ని తొలగించేందుకు ప్రభుత్వం నిరంతరం ప్రయత్నాలు చేస్తోంది.

రైతు సోదరులతో, రైతు సంఘాలతో మేము నిరంతరం చర్చిస్తూనే ఉన్నాం , వారి ప్రతి ఆందోళనను పరిష్కరించడానికి మేం సంసిద్ధంగా ఉన్నాం.

అయితే రైతుల ముసుగులో కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు సృష్టించిన విషవలయాన్ని అర్థం చేసుకోవడం కూడా అంతే అవసరం.

దేశం దురదృష్టం ఏమిటంటే, తటస్థ, మేధావులు గా విశ్వసించే కొంతమంది వ్యక్తులు తాము చెప్పిన దానికి విరుద్ధంగా మాట్లాడుతున్నారు. కానీ ప్రజల నుంచి ఏదీ దాచడం కుదరదు. వారి పాత ప్రకటనలను, వారి నిజ స్వరూపాన్ని నేడు దేశం చూస్తోంది.

తమ రాజకీయ స్వార్థం కోసం ప్రభుత్వాన్ని దెబ్బతీద్దామని వీరు ఆలోచిస్తున్నారు. కానీ, నిజం ఏమిటంటే దేశంలోని రైతులను, యువతనూ లక్ష్యంగా చేసుకొన్నారు. వీరు అమాయక రైతులను రాజకీయాలకై తోలుబొమ్మలుగా మార్చడానికి ప్రయత్నించారు.

స్వామినాథన్ కమిటీ నివేదికను తమ ప్రభుత్వం ఉన్న సమయంలో 8 ఏళ్లుగా బయటకు రాకుండా చేసిన  కాంగ్రెస్ రైతు హితాన్ని ఎలా కాగలదు?

మండీ కాకుండా ఇతర ఉత్పత్తులను విక్రయించడానికి రైతులకు వేరే మార్గాలు ఉండాలని తన మ్యానిఫెస్టోలో చెబుతున్న కాంగ్రెస్, ఇప్పుడు రైతులను అడకత్తెరలో పెడుతోంది.  ఈ

సంస్కరణలకు అనుకూలంగా లేఖలు రాసిన కాంగ్రెస్ ప్రభుత్వం లోని వ్యవసాయ మంత్రి ఇప్పుడు ఎందుకు వాటికి విరుద్ధంగా తీసుకున్నారు?

పంజాబ్ ఎన్నికల సమయంలో ఏ ఆమ్ ఆద్మీ పార్టీ తన మ్యానిఫెస్టోలో రైతులు మండీ వెలుపల ఉత్పత్తులను అమ్మడానికి వీలు కల్పిస్తుందని చెప్పిందో, ఇప్పుడు ఆ పార్టీ ఇంకో రకంగా మాట్లాడుతుందా?

హూడా కమిటీ వ్యవసాయ సంస్కరణల గురించి ప్రతిపాదించినప్పుడు, ఆ కమిటీలో అకాలీదళ్ కు చెందిన పెద్ద నాయకులు కూడా ఉన్నారు, వారు నేడు ఎందుకు విభిన్న స్వరంతో మాట్లాడుతున్నారు?

రెండు మూడు నెలల క్రితం వరకు ఈ సంస్కరణలకు మద్దతు ఇస్తున్న రైతు సంఘాలు మా ప్రభుత్వాన్ని అభినందించాయి, ఇప్పుడు వారు అకస్మాత్తుగా ఎందుకు నిరసన తెలుపుతున్నారు?

***నా రైతు సోదర, సోదరీమణులారా,***

కొన్ని దశాబ్దాలుగా మన దేశంలో ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ప్రకటనలు చేయడం చూశాము.

ప్రకటన చేయడమే గాకవాటిని ప్రామాణికతతో నెరవేరుస్తున్న ప్రభుత్వాన్ని దేశం ఇప్పుడు చూస్తోంది.

దేశ ప్రజల ఆశీర్వాదం మావైపు ఉందని చూసిన, కొన్ని పార్టీలు రైతులలో గందరగోళాన్ని వ్యాప్తి చేయడం ద్వారా తాము కోల్పోయిన రాజకీయ స్థానాన్ని తిరిగి పొందుతాయని భావిస్తున్నారు.

ఈ భ్రమలను తొలగించాల్సిన బాధ్యత మనపై ఉంది. అందువల్ల, ఆందోళన చేస్తున్న రైతులతో ప్రతి అంశాన్ని పరిష్కరించడానికి మేం నిరంతరం ప్రయత్నిస్తున్నాం.

కానీ, ఈ ఆందోళనలో రైతు ప్రయోజనాలు అసలేమాత్రం పట్టని వారు కూడా ఉన్నారని గుర్తించాలి. గత ఆరు సంవత్సరాలుగా ఒకే కుటుంబానికి చెందిన ఒక వర్గం, ఒకే రకమైన ఆలోచనలు కలిగిన సమూహం, కొన్నిసార్లు విద్యార్థులు, కొన్నిసార్లు దళిత సంఘాలు, కొన్నిసార్లు మహిళలు, మరి కొన్ని సార్లు మైనారిటీలు, సమాజంలోని వివిధ వర్గాల వెనుక దాక్కుని సమాజంలో అసంతృప్తి, దేశంలో గందరగోళాన్ని వ్యాప్తి చేయడానికి చేస్తోన్న ప్రయత్నాలను మీరూ గమనించే ఉంటారు.

నేడు, మరోసారి అన్నదాతల వెనుక దాక్కున్న వీరు తమ రాజకీయ స్వార్థం కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా హింసను, అరాచకాలను ప్రోత్సహిస్తున్నారు.

ఈ వ్యక్తులు అన్నదాతల వెనుక దాక్కుని, అల్లర్లకు పాల్పడిన వారిని, హింసను వ్యాప్తి చేస్తున్న నిందితులను వెంటనే విడుదల చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.

ఈ వ్యక్తులు దేశంలోని అన్నదాతల వెనక నక్కి గాంధీజీ విగ్రహానికి నష్టం కలిగిస్తారు. చంపారణ్ లోని రైతుల కోసం భారీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించిన గౌరవనీయ బాపును అవమానిస్తున్నారు.

రైతులకు సాగునీరు అందకుండా చేసేందుకు ఈ సంఘాలు శక్తి కొలదీ అనేక ఏళ్ల తరబడి తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి.  రైతులకు విద్యుత్ సరఫరా, ఆనకట్టల నిర్మాణానికి ఏళ్ల తరబడి వీరు  అడ్డంకులు కల్పిస్తున్నారు. ఇప్పుడేమో రైతుల హితం కోసం పోరాడుతున్నట్లుగా కపట నాటకాలు వేస్తున్నారు.

స్వావలంబన భారతదేశం అనే దృఢ సంకల్పంతో దేశం ముందుకు సాగుతున్న, 'వోకల్ ఫర్ లోకల్' నినాదంతో భారతదేశ ఉత్పత్తులను బహిష్కరించమని ప్రకటించే వారి ఉద్దేశాలను గుర్తించాల్సి ఉంది.

లేహ్-లడఖ్ లో సరిహద్దులో భద్రతా సవాళ్లు పెరిగినప్పుడు, అనేక అడుగుల మంచు ఉన్నప్పుడు, సరిహద్దు వైపు ఉన్న జవాన్లకోసం సరుకులు తీసుకెళుతున్న రైళ్లను నిలిపివేసిన వారు రైతులు కాదు.

ఈ వ్యక్తుల కారణంగా, మనం మన సైనిక దళాలకు లాజిస్టిక్స్, ఇతర అవసరమైన వస్తువులను వాయు, ఇతర మార్గాల ద్వారా పంపిణీ చేయవలసి వస్తోంది. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఖర్చు చేయవలసి వస్తోంది.

1962 వ సంవత్సరంలో జరిగిన యుద్ధంలో దేశానికి మద్దతు ఇవ్వని వారు,ఇందులో చాలా మంది ఉన్నారు.

నేడు, ఈ వ్యక్తులు మళ్ళీ 1962 భాష మాట్లాడుతున్నారు.

ఈ వ్యక్తులు వారి నీచమైన ఉద్దేశ్యాలతో, కుట్రలతో రైతుల నిష్కల్మషమైన మనస్సులను కలుషితం చేయడానికి ప్రయత్నించారు.

ఈ ఆందోళన ప్రారంభించినప్పుడు మన రైతు సోదరసోదరీమణులు నాడు తమ లక్ష్యం ఏమిటి, నేడు ఏమి జరుగుతోంది? అనేది ఒక సారి బేరీజు వేసుకోవాలి.

ఎవరి ప్రలోభాలకు లొంగకుండా, వాస్తవాల ఆధారంగా ఆలోచించవలసిందిగా చేతులు జోడించి, ఈ లేఖ ద్వారా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను.

మీ సందేహాలను నివృత్తి చేయాల్సిన, భయాలను తొలగించవలసినది మా ప్రభుత్వ బాధ్యత. మేము ఈ బాధ్యత నుండి ఎన్నడూ వెనక్కి తగ్గలేదు, ఎప్పటికీ వెనక్కి తగ్గము.

"సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" మంత్రాన్ని అనుసరించి, ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో మన ప్రభుత్వం వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం చేసింది. గత 6 సంవత్సరాల చరిత్ర దీనికి సాక్షి.

రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఈ సంస్కరణలు భారత వ్యవసాయంలో ఒక కొత్త అధ్యాయానికి పునాదిగా మారి, దేశ రైతులకు మరింత స్వయం సాధికారతను కల్పించగలవని విశ్వసించండి.

ఈ వ్యవసాయ సంస్కరణల శక్తితో, మనందరం సమష్టిగా భారతదేశ వ్యవసాయం సమృద్ధి, సుసంపన్నం చేద్దాం .

***మీ,***

***నరేంద్ర సింగ్ తోమర్***

***వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి, భారత ప్రభుత్వం***

***